

ఎంపిపి రాజ్యలక్ష్మి ఫిర్యాదుపై డిఎల్‌డిఒ విచారణ

ప్రజాశక్తి- రౌతులపూడి

ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్‌టి కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై పెద్దాపురం డివిజన్ డి.ఎల్.డి.ఒ. కెఎన్‌వి ప్రసాద్ రావు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో విచారణ చేపట్టారు ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి మండల పరిషత్ కార్యాలయంలో తనకు తెలియ పరచకుండా సమావేశం ఏర్పాటుతోపాటు మండల పరిషత్ కు సంబం ధించిన రికార్డులు తనకు అధికారులు తెలియపరచలేదని అంతేకాకుండా మండలంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో ప్రొటోకాల్ పాటించడం లేద, మండల పరిషత్ కార్యాలయంలో తనకు గౌరవం ఇవ్వడం లేదని ఎస్‌టి కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. ఈ విషయమై ఎంపిపి రాజ్యలక్ష్మి. ఎంపీడీఒ ఎం.గోవిందు నుంచి వివరాలు సేకరించామని ప్రసాద్ రావు తెలిపారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని విలేకరులకు తెలిపారు.

మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేస్తాం

- రైతులకు కలెక్టర్ కృతికా శుక్లా భరోసా

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మాండూస్ తుఫాను కారణంగా ఇటీవల కురిసిన వర్షాలకు, రైతులు నిల్వ చేసిన ధాన్యం మొలకలు వచ్చినప్పటికీ ఆ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కలెక్టర్ కృకా శుక్లా రైతులకు భరోసా ఇచ్చారు. తాళ్ళరేవు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి వేగవంతం చేయాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం సంకటరేవు ఆర్‌బికె వద్ద విలేకరులతో ఆమె మాట్లాడారు. ధాన్యంలో తేమ శాతం ఉన్న ప్పటికీ కొనుగోలు చేయవలసిందిగా ఆర్‌బికేల సిబ్బందికి సూచనలు ఇచ్చామన్నారు. కాకినాడ జిల్లాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. స్పష్టం చేశారు. తొలుత పోలేకుర్రు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ తీరును పరిశీలించారు. ఆర్‌బీకే స్థాయిలో జరిగిన ధాన్యం కొనుగోలు వివరాలను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకు న్నారు. అందుబాటులో ఉంచిన గోనె సంచులను, ధాన్యం శాంపిళ్లను పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా వారికి అన్ని విధాలా సహాయంగా ఉండాలని సూచించారు. మాండూస్ తుఫాను వల్ల ఇప్పటి వరకు ఎలాంటి నష్టం నమోదు కాలేదని, ఒకవేళ ఎక్కడైనా రంగు మారినా, మొలకెత్తినా ఆ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రైతుల్లో విశ్వాసం నింపేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నట్లు వివరించారు. కాకినాడ జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1,15,000 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరిపినట్లు తెలిపారు. మెట్ట ప్రాంతంలో తుని, తొండంగి ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే కోతలు మొదలయ్యాయని, ఇదే సమయంలో తాళ్లరేవు, కాజులూరు, కాకినాడ రూరల్ తదితర ప్రాంతాల్లో కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నా యని తెలిపారు. ధాన్యం సేకరణకు సంబంధించి రైతులకు ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. మిల్లర్ల నుంచి ఏదైనా సమస్యలు వస్తే తహశీల్దార్ నేతత్వంలోని బృందం వెంటనే పరిశీలించి, పరిష్కరించేలా ఏర్పాట్లు చేశామన్నారు. రైతులకు అన్ని విధాలా తోడుగా ఉంటామని కలెక్టర్ కృతికా శుక్లా స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట పౌర సరఫరాల డీఎం డి.పుష్పమణి, ప్రత్యేక అధికారి డీ.ఎస్. సునీత, మండల వ్యవసాయ అధికారి ప్రశాంతి, తాళ్ళరేవు తహశీల్దార్ పోతురాజు, ఎంపీడీవో ఎం.అనుపమ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తాళ్లరేవు మండలంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా



జిజిహెచ్ గేట్ వద్ద ధర్నా చేస్తున్న తొలగించబడిన ఔట్సోర్సింగ్ ఉద్యోగులు

విధుల్లోకి తీసుకోవాలని ధర్నా

- కొనసాగిన జిజిహెచ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి లో అక్రమంగా తొలగించబడిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం ఆసుపత్రి సెంటర్ గేట్ వద్ద ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నాయకుడు పి.ఎస్. రాయుడు మాట్లాడుతూ గత 29 సంవత్సరాలుగా చాలీ చాలని జీతాలు తీసుకుంటూ, సకాలంలో జీతాలు రాకపోయినా సేవలు అందించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఒక్కసారిగా రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం విధుల్లోకి తీసుకోవాల్సి ఉందన్నారు. అయినా జిజిహెచ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తొలగించబడిన జిజిహెచ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తక్షణమే విధుల్లో చేరడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వరకుమార్, సత్యభూషణం, శ్రీనివాస్, లలిత కుమారి, బేబి రాణి, పద్మిని, మేరీ, కుమారి, చక్రవర్తి, రఫీ, వెంకట రమణ పాల్గొన్నారు.

నవరలో మొలకెత్తిన ధాన్యం

- బస్తాకు 5 కిలోల కోత అంటున్న మిల్లర్లు - రైతుల ఆవేదన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండూస్ తుఫాన్ ప్రభావంతో గత ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సామర్లకోట మండలం నవర గ్రామంలో దుర్గమ్మగుడి ప్రాంతంలోని రైతు పొలంలో రాశిగా పోసిన ధాన్యం మొలకలు వచ్చాయి. రైతు సోమవారం ఉదయం కాచిన ఎండకు ఎండబెట్టుకోవడానికి ధాన్యం రాశులపై ప్లాస్టిక్ బరకాలు తొలగించి చూడగా ధాన్యం మొలకలు వచ్చింది. దాంతో వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయగా, ఇన్‌చార్జ్ విఎఎ హారిక వచ్చి ధాన్యాన్ని పరిశీలించి ఎటువంటి కటింగ్ లేకుండా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తారని సమీపంలోని రైసు మిల్లుకు ధాన్యం తోలుకోమని చెప్పారని రైతు దమ్మాల శ్రీనివాసు చెప్పారు. అయితే సమీప గ్రామాల్లోని రైసు మిల్లులకు ధాన్యం శాంపిల్ తీసుకెళితే మొలకలు వచ్చిన కారణంగా బస్తాకు 5కిలోలు చొప్పున కటింగ్ చేస్తామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన ఆరు ఎకరాల వరి ధాన్యం రాశులు ఈ విధంగా వర్షాల కారణంగా మొలకలు వచ్చాయన్నాడు. అలాగే సమీపంలోని ఎస్‌జఅప్పారావుకు చెందిన 3 ఎకరాల ధాన్యం రాశులు, దేవాది బాలుకు చెందిన 3ఎకరాలు రాశులు కూడా తడిసిపోయి మొలకలు వచ్చాయి. ప్రస్తుతం ధాన్యంను ఎడ్లబండ్ల సాయంతో మెరక ప్రాంతానికి తోలుకుని ఆరబెట్టుకుంటున్నానన్నారు. దీనివల్ల ఎకరాకి రూ.2000ల వరకూ అదనంగా ఖర్చులు అవుతున్నాయని, బస్తాకు రూ.100 చొప్పున కట్ చేస్తే నా పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నాడు. సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ వచ్చి న్యాయం చేస్తారని ఆర్‌బికె సిబ్బంది చెప్పారని అయితే ఇంకా రాలేదన్నారు. మండలంలో భీమవరం, సామర్లకోట, వేట్లపాలెం, నవర, గొంచాల తదితర గ్రామాల్లో నీరు లాగి తడిసిన ధాన్యం గట్టులుగా పోసి ఆరబెట్టుకుంటూ తేమశాతంతో సంబంధ లేకుండా ప్రభుత్వం తడిసిన ధాన్యంను కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



విఎఎకు మొలకలు వచ్చిన ధాన్యాన్ని చూపుతున్న రైతు శ్రీనివాసు

ఆశా వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

ఆశా వర్కర్ల కు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం కాకినాడ అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వద్ద కాకినాడ ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించి తహశీల్దార్ సతీష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నగర కార్యదర్శి భారతి మాట్లాడుతూ ఆశా వర్కర్లుగా 24 గంటలు సేవలు అందిస్తున్నామన్నారు. కానీ రూ.10 వేలు మాత్రమే ఇస్తున్నారని, పెరిగిన ధరలతో ఏవిధంగా జీవనం సాగించాలన్నారు. ఆశా వర్కర్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ సతీష్‌కు వినతి పత్రం అందజేయగా ఆయన వారి సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామ న్నారు. కార్యక్రమంలో పాప, కృపావతి, నాగలక్ష్మి, వేణు, కుమారి, సుజాత, రెహనా బేగం, లక్ష్మీ నరసమ్మ, సోనీ, మేరీ, అరుణ, లక్ష్మిలతో పాటు సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశావర్కర్లు

అంగన్‌వాడీల ధర్నా

-బ్రహ్మమణిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - పెద్దాపురం

రాజకీయ వేధింపుల కారణంగా విధుల నుండి తొలగించబడిన అంగన్‌వాడీ వర్కర్ బ్రహ్మమణిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముందు స్థానిక మున్సిపల్ సెంటర్ నుండి ఐసిడిఎస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు దడాల పద్మ మాట్లా డుతూ అంగన్‌వాడీ వర్కర్లపై రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయని, పని ఒత్తిడి పెంచడం కారణంగానే కోరుకొండ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ వర్కర్ చనిపోయారన్నారు. రాజకీయ వేధింపులతోనే బ్రహ్మమణిని విధుల నుండి తొలగించారన్నారు. న్యాయం చేయాలని అనేక దఫాలుగా అధికారులకు నివేదించినా పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. బ్రహ్మ మణికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ పోరాటంలో భాగంగా ఈ నెల 13 నుండి రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష ,కార్యదర్శులు పుప్పాల సావిత్రి, దాడి బేబీ,యూనియన్ నాయకులు బ్రహ్మమణి,శుభా రత్నం,ఉమా,వెంకటరమణ, తులసి, సత్యవేణి, చక్రవేణి, లోవతల్లి,వి జ్యోతి, దీవెన తదితర అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ శివదాస్‌కు సిఐటియు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

పిఎఫ్ సమస్యల పరిష్కారానికి వినతి

- సిఐటియు ఆధ్వర్యంలో జిజిహెచ్ శానిటరీ కార్మికులు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో శానిటేషన్ వర్కర్స్ పి.ఎఫ్. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కాకినాడ బోటు క్లబ్ సమీ పంలో గల జిల్లా పి.ఎఫ్.కార్యాలయంలో ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ టి.శివదాస్‌కు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.విజయ్ కుమార్‌లు మాట్లాడుతూ కాకినాడ జిజిహెచ్‌లో గత 20 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో శానిటేషన్ నిర్వహణ జరుగుతోందన్నారు. అయితే ఎన్నడూ లేని సమస్య తాజాగా కృష్ణా కన్స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టు పొందిన తరువాత వచ్చిందన్నారు. 2021 జూన్ నుండి పి.ఎఫ్. చెల్లింపులో కార్మికుల వాటా, యజమానుల వాటా రెండూ కలిపి కార్మికుల జీతం నుండే మినహాయిస్తున్నారని తెలిపారు. దీనివల్ల ఒక్కో కార్మికుడు నెలకు సుమారు రూ.1400 నష్టపోవడం జరుగుతోందన్నారు. ఈ విషయమై గత నెలలో రాజమహేంద్రవరం పి.ఎఫ్. రీజినల్ కమిషనర్‌కి విన్నవించామని, సోమవారం కాకినాడలో వినతిపత్రం సమర్పించామన్నారు. వినతిపత్రం తీసుకున్న పి.ఎఫ్. ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ టి.శివదాస్ సానుకూలంగా స్పందించారన్నారు. రాజమహేంద్రవరం కమిషనర్ నుండి కాపీ వచ్చిందని త్వరలోనే విచారణకు వచ్చి కార్మికులకు న్యాయం చేస్తామ న్నారు. పి.ఎఫ్. చెల్లింపులపై కార్మికుల సందేహాలు నివత్తి చేశారు. కార్యక్రమంలో పలివెల వీరబాబు, సిహెచ్.విజయ్‌కుమార్‌లతో పాటు యూనియన్ నాయకులు జె.శేషు, ఆర్.రమేష్, ఎస్.వాసు, ఎం.ఏసు, డి.జనార్ధన్, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరులో వర్షం

ప్రజాశక్తి - కోటనందూరు

తుఫాను ప్రభావంతో గత నాలుగు రోజులనుగా కోటనందూరు పరిసర ప్రాంతాల్లో సోమవారం కూడా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో ప్రధాన రహదారులన్నీ వర్షపునీడితో నిండి పోయాయి. కోటనందూరులో బస్సు షెల్టర్‌లో వర్షం నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత నాలుగు రోజుల నుండి వరి పంట కోతలు కోయడంతో పొలాల్లోనే నీటిలో ఉండి పోయాయి. కెఇ చిన్నయపాలెం, ఎస్ఆర్ పేట, బీహెచ్ కోట, తాటిపాక గ్రామాలలో కొన్నిచోట్ల వరి పంట కోతకు సిద్ధంగా ఉన్నప్పటికీ వర్షాల వల్ల వీలు కాకుండా పోయిందని రైతులు తెలుపు తున్నారు.

పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

ప్రజాశక్తి- అన్నవరం

అన్నవరంలో పాత బస్ స్టాండ్ వద్ద సుమారు రూ.2 కోట్లు వ్యయంతో నిర్మించ తలపెట్టిన పంచాయతీ షాపింగ్ నిర్మాణ నూతన కట్టడాన్ని ఎంఎల్ఎ పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎస్.కుమార రాజా అధ్యక్షతన జరిగిన సమా వేశంలో. ఎంఎల్ఎ పర్వత మాట్లాడుతూ పంచాయతీ పాలకవర్గం విరివిగా ఇటువంటి కమర్షియల్ నిర్మాణాలు చేపడితే స్థానిక సంస్థలు ఆదాయ పరంగా బలోపేతం అవుతాయన్నారు. తద్వారా గ్రామాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. కార్యక్ర మంలోఎంపిపి పి.రాజబాబు, పంచాయతీ కార్యదర్శి జయంతి శివరామకృష్ణ, ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్న బాబు, మండల ఉపాధ్యక్షుడు దారా వెంకట రమణ, పాలకవర్గ సభ్యులు, సచివాలయం సిబ్బంది పాల్గున్నారు.



అర్జీ దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా



అర్జీదారుల నుంచి సమస్యలు వింటున్న ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు



అర్జీలు స్వీకరిస్తున్న కాకినాడ కమిషనర్ రమేష్

గడువులోగా అర్జీలకు పరిష్కారం

కలెక్టరేట్ స్పందనలో290 అర్జీలు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వ ప్రతిష్టాత్మక స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలనికలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్పందనలో కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్ఒ కె.శ్రీధర్‌రెడ్డి, జడ్‌పి సిఇఒ ఎన్.వి.వి.సత్య నారాయణ, ఎస్‌సికార్పొరేషన్ ఇడి డీఎస్ సునీతలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌర సరఫరా సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు, పెన్షన్లు, సర్వే తదితరాలకు సంబంధించి మొత్తం 290 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 77 అర్జీలు

కాకినాడ కార్పొరేషన్ : కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ కు 77 అర్జీలు వచ్చాయని ఎస్పి రవీంద్రనాథ్ బాబు తెలిపారు. అర్జీ దారులతో ముఖాముఖి మాట్లాడి, చాలా వారి సమస్యల విని, సత్వర సమస్యలు పరిష్కారానికి సంబంధిత పోలీసు అధికారులతో ప్రత్యక్ష వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్పందనకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.కార్యక్రమం అనంతరం అర్జిదారులకు ఎస్పీ రవీంద్రనాథ్ బాబు ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు పి శ్రీనివాస్, ఎస్ బి ఎం అంబికా ప్రసాద్, కాకినాడ ట్రాఫిక్ డిఎస్పి ఎం వెంకటేశ్వరరావు, కాకినాడ పట్టణ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు

కమినర్ స్పందనలో ఆర్జీలు స్వీకరణ

కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం కమిషనర్ కె.రమేష్ ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలను స్వీకరించారు. ఆయా వినతులను సత్వరమే పరిష్కరించాల్సిందిగా అక్కడే ఉన్న వివిధ విభాగాధిపతులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్ మాట్లాడుతూ న్యాయపరమైన, ఆర్థికపరమైన అంశాలు మినహా మిగిలిన దరఖాస్తులను నిర్ణీత వ్యవధిలో వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా ఫిర్యాదులు అంద జేయవచ్చునన్నారు. వాటికి కూడా సత్వర పరిష్కారం లభిస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు.

ఏలేశ్వరం కమిషనర్‌గా శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం నగర పంచాయతీ ప్రస్తుత మేనేజర్ కె.శ్రీనివాస్‌కు సోమవారం ఎఫ్ఏసి కమిషనర్‌గా నియమిస్తూ ఉన్నతా ధికారుల నుండి ఉత్తర్వులు ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలస కమిషనర్‌గా చేసిన అనుభవంతో ఏలేశ్వరం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా స్వచ్ఛ ఏలేశ్వరంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతి నిధులు ప్రజల సహకారంతో కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు టిపిఒ కె.బి.ఆనంద్ కుమార్, ఏఇలు కె.బంగార్రాజు, కె.అనుష లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ బిహెచ్ శ్రీనివాసులు అభినందనలు తెలియజేశారు.



నూతన కమిషనర్ శ్రీనివాస్

డిమాండ్లు నెరవేర్చాలని రెవెన్యూ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - కాజులూరు

రెవిన్యూ ఉద్యోగుల డిమాండ్లు సకాలంలో నెరవేర్చాలని కోరుతూ మండల రెవిన్యూ ఉద్యోగుల సంఘం తహశీల్దార్ సత్యనారాయణకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు ఈశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాలని, విధి నిర్వహణలో చని పోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం సకాలంలో ఇవ్వాలని, రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్న 3795 మంది ప్రొబేషన్ డిక్లేర్‌చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని, సచివాలయంలో 90 శాతం రెవెన్యూకు సంబంధించిన పనులు మాత్రమే ఉంటున్నాయని అందువల్ల కంప్యూటర్లు అందించాలని కోరారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

తుఫాను కారణంగా ధాన్యం తడిసిన వరి రైతులు నష్ట పోకుండా వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పాటించాలని స్థానిక డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్‌వి నరసింహా రావు, ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ.సీతా రామ శర్మ, డాక్టర్ ఎస్.బాలాజీలు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ తుపాను వల్ల పడిపోయిన వరి పైరు, కోసిన వరి పనలు వర్షపు నీటిలో తడిస్తే గింజలు మొలకెత్తడం, రంగు మారడం వంటివి జరగకుండా పనల పైన, కంకుల పైన పడేటట్లు ఐదు శాతం ఉప్పు కలిపిన ద్రావణాన్ని చల్లాలన్నారు. చేలో ఉన్న నీటిని బయటికి తొలగించాలన్నారు. పనలు ఆరకుండా కుప్పలు వేసే సమయంలో కుప్పవేసే వరుసల్లో ఉప్పు ద్రావణాన్ని చల్లాలన్నారు. వరి నూర్పులు జరిగేటప్పుడు కల్లాల్లో ధాన్యం తడిస్తే ఎండబెట్టి లేదా తడిసిన ధాన్యానికి ఉప్పు కలిపి పోగు పెడితే ధాన్యం పాడవ్వకుండా నిల్వ చేయవచ్చన్నారు.

2025 నాటికి 'క్షయ'ను రూపుమాపాలి

- దాతలు సహకారం అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

దేశంలో 2025 నాటికి క్షయ వ్యాధిని రూపుమాపేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణకు కార్పొరేట్, కోఆపరేటివ్, స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహకారం అందించాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. సోమవారం కలెక్టరేట్ కోర్టు హాలులో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం అమలు పర్యవేక్షణకు ఏర్పాటైన జిల్లా టిబి ఫోరమ్ కమిటీ సమావేశం కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన జరిగింది. గత సెప్టెంబరు 9వ తేదీన కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధాన మంత్రి టిబి ముక్త్ అభియాన్‌ను భారత రాష్ట్రపతి ప్రారంభించారని తెలిపారు. క్షయ నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషిలో కార్పొరేట్ సంస్థలు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు నిక్షయ మిత్రులుగా చేరి సహాయ సహకారాలు అందజేయాలని ఆమె కోరారు. క్షయ వ్యాధి నివారణలో చికిత్సతో బాటు, రోగులు ఒక్కక్కరికీ నెలకు రూ.700 విలువ చేసే పౌష్టికాహార కిట్లను అందించాలని నిక్షయ మిత్రులుగా భాగ స్వామ్యంవహించే సంస్థలు, వ్యక్తులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కాకినాడ జిల్లాలో మొత్తం 1626 మంది క్షయ రోగులు చికిత్స పొందుతున్నారని, కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు తాము కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రాంతంలోని రోగులను దత్తతకు స్వీకరించి ఈ పౌష్టికాహార కిట్లను ప్రతి త్రైమాసానికి సరిపడా ఒకసారి చొప్పున 6 నెలల నుండి 3 ఏళ్ల వరకూ అందిచవచ్చునని ఆమె తెలిపారు. తాళ్లరేవు మండలంలో నిక్షయ మిత్రగా సేవలందించేందుకు ముందుకు వచ్చిన రిలయన్స్ ఇండ్రస్టీస్ లిమిటెడ్ సంస్థను అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో మిగిలిన సంస్థలు ఔదార్యంతో ముందుకు రావాలని కోరారు. అలాగే జిల్లా అధికారులు కూడా నిక్షయ మిత్రలుగా భాగస్వామ్యం వహించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ స్వయంగా ఒక క్షయ రోగి బాధ్యతలను స్వీకరించి అతనికి పౌష్టికాహార కిట్టును అందజేశారు. అందరి సమష్టి భాగస్వామ్యంతో కాకినాడ జిల్లాను క్షయ ముక్త జిల్లాగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ కృతికా శుక్లా ఈ సందర్భంగా ప్రజలకు పిలుపు నిచ్చారు. సమావేశంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ ఆర్ రమేష్, జడ్.పి. సిఈఒ ఎన్.వి.వి. సత్యన్నారాయణ, డిపిఓ ఆర్.విక్టర్, సిపిఓ పి.త్రినాద్, రెడ్ క్రాస్ జిల్లా విభాగ అధ్యక్షుడు వై.డి. రామారావు, ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ మోకా పవన్ కుమార్, డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ విఘ్నేష్, స్టేట్ టిబి ఫోరం సభ్యులు పి.శర్మ తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్ల ను అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కార్టూన్ 'నిజం'




ఎన్నికల్లో..ఓడిపోయినా బెంగేంలేదు సార్..!!
గెల్చిన ప్రభుత్వాన్ని కూల్చేసి ఎలాగూ
అధికారంలోకొచ్చే సత్తా వుంది..!!

'వైసిపి అరాచక పాలనతో ప్రజల అవస్థలు'

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్, కరప

వైసిపి అరాచక పాలనతో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని కాకినాడసిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు విమర్శించారు. తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా సోమవారం కొండబాబు టిడిపి శ్రేణులతో కలిసి 38 వ డివిజన్ నందు పర్యటించి వైసిపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై స్థానిక ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉన్న పలు కారణాలు చూపి సంక్షేమ పథకాలను నిలిపివేస్తున్నారని కొండబాబు దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, ఏవిడి మెంటారావు, నానావరపు సుబ్రహ్మణ్యం, సీరం అప్పారావు, మజ్జి రాంబాబు, వేములు మంగాపతి, గొంగటి ఆంజనేయులు తది తరులు పాల్గొన్నారు. కరప మండలం వేములవాడలో సోమవారం కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్య నారాయణమూర్తి గ్రామంలో ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టిడిపి హయాంలో కట్టించిన కమ్యూనిటీ హాళ్లను సచివాలయాలుగా మార్చారని, దీంతో చిన్నపాటి ఫంక్షన్లను చేసుకోవాలన్న పేద మధ్యతరగతి ప్రజలకు ఆర్థికంగా భారంగా మారిందన్నారు. కార్యక్రమంలో గుల్లిపల్లి శ్రీనివాసరావు, అప్పనపల్లి నారయ్య, పి. సత్యనారాయణ, చీపురుపల్లి జయేంద్రబాబు, పంపన కన్నారావు, యాసలపు విష్ణు ఓలేటి వాసంశెట్టి రమణ, సుకుమార్, రెడ్డి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



వేములవాడలో ప్రజలను పలుకరిస్తున్న అనంతలక్ష్మి, సత్తిబాబు



పతకాలను సాధించిన విద్యార్థులతో శ్రీభారతి కరస్పాండెంట్ వీరబాబు, ఉపాధ్యాయులు

కరాటేల్లో శ్రీ భారతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల భూమి కరాటే అకాడెమీ నిర్వహించిన కరాటే పోటీల్లో ప్రత్తిపాడు మండలంలోని వొమ్మంగి శ్రీభారతి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎస్.వీరబాబు మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యతో పాటు ఇతర మార్షల్ ఆర్ట్స్, స్పోర్ట్స్‌లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఇటీవల జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఏపి స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు కైవసం చేసుకుని ముందంజలో నిలిచారన్నారు. ఏడో తరగతి చదువుతున్న సిహెచ్.కోదండరాం, ఎస్.మల్లేశ్వర్, కె.కార్తికేయ, జె.దేవసత్య, ఆరో తరగతి చదువుతున్న ఎస్.ప్రవీణ్, ఒకటో తరగతి చదువుతున్న జి.తేజస్విని బంగారు పతకాలు సాధించారన్నారు. 6వ తరగతి చదువుతున్న ఎస్.ప్రవీణ్, ఏడవ తరగతి చదువుతున్న జె.నవీన్, డి.అరవింద్, జి.హర్ష, జె.అవినాష్, ఎస్.కీర్తి, జె.దేవిసత్య, ఇ.లారెన్స్ రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్స్ పొందారని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం ఆర్.బుల్లిరమణ, ఆర్‌ఎస్ సిహెచ్.కృష్ణ, సిహెచ్.రాము, పీడీలు గోవింద్, పి.బుజ్జి అభినందించారు.



క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడుతున్న క్రీడాకారులు

హోరాహోరీగా టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక లిటరరీ అసోసియేషన్ గ్రౌండ్ లో గిష్ట్,లిటరరీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి టెన్నిస్ ఛాంపియన్షిప్ పోటీలు మూడవరోజు హొరా హొరీగా జరుగుతున్నాయని టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రాజా సూరిబాబు రాజు, పసల పద్మ రాఘవ రావులు సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక,గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుండి 140 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. 35 ప్లస్,45 ప్లస్,55 ప్లస్,65 ప్లస్,70 ప్లస్ విభాగాల్లో డబుల్ ,సింగిల్స్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారన్నారు. సోమవారం రాత్రి క్వార్టర్ ఫైనల్స్ పోటీలు ముగిశాయన్నారు.13వ తేదీ నుండి అన్ని విభాగాల్లో సెమీఫైనల్స్ పోటీలు జరుగుతాయన్నారు.70 ప్లస్ డబుల్స్ విభాగంలో క్రీడాకారులు ఏఆర్ రావు, జి.పార్వతీశంలు, డాక్టర్ ఎస్ రామకృష్ణ, వరప్రసాద్‌లు సెమీఫైనల్స్ కు చేరుకున్నారన్నారు.

ఆదిత్యలో 13వ స్టాటస్టిక్స్ ఒలింపియాడ్ పరీక్ష

- 25 తేదీ లోగా రిజిస్ట్రేషన్‌కు చేయించుకోవాలి

ప్రజాశక్తి- కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సి.ఆర్.రావు అడ్వాన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, స్టాటస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో స్టాటస్టిక్స్ ఒలంపియాడ్-2022 పరీక్ష నిర్వహించనున్నట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరానికి గాను ఈ పరీక్షను 2023వ సంవత్సరం జనవరి 29 ఆదివారం ఉదయం 9:30 నుండి కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ పరీక్ష రాయడానికి అర్హత గల అభ్యర్థులు ఈ నెల 25 తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉంటుంది. ఒలంపియాడ్ 2022 పరీక్ష జూనియర్ కేటగిరీలో ప్రస్తుతం 9,10 తరగతులు చదువుతున్నవారు, సీనియర్ కేటగిరిలో 11,12 తరగతులు లేదా ఇంటర్మీడియట్, డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న వారు అర్హులు. జనరల్ నాలెడ్జ్, లాజికల్ థింకింగ్, కాంప్రహెన్షన్స్ రూపంలో ఉండే ఈ పరీక్షలో మొదటి మూడు స్థానాలు సాధించిన విజేతలకు ప్రథమ స్థానం రూ.15,000, ద్వితీయ స్థానం రూ.10,000, తతీయ స్థానం రూ.7,000 నగదు బహుమతులు, మొదటి 15 స్థానాల్లో నిలిచిన ర్యాంకర్లకు ప్రశంసా పత్రాలను అందజేస్తారు. అంతర్జాతీయ స్థాయిలో జరగనున్న ఈ పరీక్షకు గోదావరి జిల్లాలలో కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల కేంద్రంగా ఉంటుందని, ఈ పరీక్షకు రూ.150 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు www.crraoaimscs.res.in వెబెసైట్‌లో చూడాలని తెలిపారు.

నిర్లక్ష్యం వీడండి.. భద్రత పాటించండి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వాహనాలు నడిపే సమయంలో ప్రజలు నిర్లక్ష్యం విడనాడాలని, భద్రత చర్యలు పాటించాలని కాకినాడ జిల్లా ఎస్‌పి ఎం.రవీంద్రనాథ్ బాబు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు అధికారులతో రహదారి భద్రతపై పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాత్రి సమయంలో వాహనాలను హైవే రోడ్లపై నిలిపి ఉంచడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనివల్ల ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని, కుటుంబంలో సంపాదించే వ్యక్తి కోల్పోతే ఆ కుటుంబ పరిస్థితి దయనీయ స్థితిలో ఉన్నందున ప్రజలు దీనిపై దృష్టి సారించాలన్నారు. పోలీస్ శాఖ వాహనదారులను, ప్రజలను, విద్యార్థులకు చైతన్యపరచేలా అవగాహన కార్యక్ర మాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి, ముఖ్యంగా హైవేల, ముఖ్య రహదారులను ఎనిమిది జోన్లుగా విభజించి, ఒక్కో జోనుకు రహదారి భద్రత వాహనాన్ని కేటాయించి, ఒక సిఐ ను ఇన్‌ఛార్జిగా నియమించి 24 గంటలు రహదారులపై ప్రజలకు అందుబాటులో ఉండేటట్టు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతిరోజు నో యాక్సిడెంట్ డే నిర్వహించి రహదారి ప్రమాదాలను నివారించాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పిలు పి.శ్రీనివాస్, ఎం.అంబికా ప్రసాద్, కాకినాడ ట్రాఫిక్ డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, కాకినాడ పట్టణ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ నేత మోగంటి మృతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



మోగంటి నాగేశ్వరరావు (ఫైల్)

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నేత మోగంటి నాగేశ్వరరావు (82) సోమవారం మృతి చెందారు. ఆయన గతంలో సిపిఎం, సిఐటియులో పని చేశారు. కోనసీమ ప్రాంతంలోని ముక్తేశ్వరం వద్ద గల వీరవల్లిపాలెంలో మోగంటి సుబ్రహ్మణ్యం, శేషమ్మ దంపతులకు 1940లో జన్మించారు. 14వ ఏటనే తన తండ్రిని కోల్పోయారు. 3వ తరగతి వరకు చదువుకున్న ఎంఎన్ ఆర్థిక సమస్యలతో చదువును నిలిపేశారు. కుల వృత్తి అయిన స్వర్ణకార పని చేశారు. అమలాపురం, కపిలేశ్వరపురం మండలం అంగరలో కొంత కాలం అదే వృత్తిని కొనసాగించారు. అంగరలో తోరాటి లక్ష్మణమూర్తి సహచరుడు కొలుసు నీలకంఠంతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఆయన వామపక్ష భావజాలాన్ని అలవర్చుకున్నారు. 1962లో రాజమండ్రి చేరుకుని ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో పని చేశారు. 1964లో సిపిఎం సభ్యత్వం పొందారు. 1968 దాకా నక్సలైట్ ఉద్యమం వైపు వెళ్లి అది సరికాదనిగ్రహించి తిరిగి 1970లో సిపిఎంలో చేరారు. 1971లో ఏపి పేపర్ మిల్లు యూనియన్ ఆర్గనైజరగా బాధ్యతలు తీసుకున్నాడు. 1986 నుంచి 1988 వరకు కాకినాడ పట్టణ కార్మికోద్యమంలో బాధ్యతలు నిర్వహించారు. 1971లో పార్టీ పేపర్ మిల్లు యూనియన్ శాఖా కార్యదర్శిగా, 1973 నుండి పట్టణ కమిటీ సభ్యునిగా, 1980 నుండి 1997 వరకు జిల్లా కమిటీ సభ్యుడుగా, 1983నుండి 1995 వరకు కార్యదర్శి వర్గ సభ్యునిగానూ పనిచేశారు. 1997వరకు రాజమండ్రి పార్టీ పట్టణ కమిటీ కార్యదర్శి గాను బాధ్యతలు చూశారు. 2003నుంచి పార్టీకి దూరంగా ఉన్నా రాజకీయంగా మార్క్సిస్టు సైద్ధాంతిక భావజాలంతోనే కొనసాగారు. 2007లో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ స్థాపించారు.

సిపిఎం సంతాపం

పూర్వ సిపిఎం నేత, సీనియర్ సిటిజన్స్ నాయకులు, కార్మిక నేత ఎం.నాగేశ్వరరావు మతికి సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కమిటీ సంతాపాన్ని వ్యక్తం చేసింది. రాజమహేంద్రవరంలోని పి అండ్ టి కాలనీలో స్వగృహంలో ఆయన మతదేహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, జిల్లా సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్, పోలిన వెంకటేశ్వరరావు, ఎస్ఎస్.మూర్తి, టి.సావిత్రి, సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, సిపిఎం నాయకులు జి.తాతారావు, జె.భాస్కర్, కె.సురేష్, సోమేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. సుదీర్ఘ కాలం సిపిఎం, కార్మిక సంఘాల నిర్మాణం లోను పని చేసిన నాగేశ్వరరావు మతికి సిపిఎం నాయకులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

గురువులకు స్థానచలనం

- మొదలైన బదిలీల ప్రక్రియ

- ఎంఇఒ, హెచ్‌ఎంలతో ఇన్‌ఛార్జి డిఇఒ సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ డిఇఒ

పాఠశాలల ప్రారంభానికి ముందు చేపట్టవలసిన ఉపాధ్యాయ బదిలీలకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థుల్లోనూ ఉత్కంఠ నెలకొంది. ఏటా వేసవి సెలవుల అనంతరం నిర్వహించే ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ విద్యా సంవత్సరం ప్రారంభమైన 5నెలల తర్వాత చేపట్టింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 2,200 మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగే అవకాశాలు ఉన్నాయి. జీరో సర్వీసు వారూ బదిలీలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడంతో ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు న్నాయి. విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తిని పరిశీలించి పిల్లలు తక్కువగా ఉన్న పాఠశాల నుంచి ఇతర ప్రాంతాలకు కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. క్రమబద్ధీకరణతో పోస్టు కోల్పోయిన చోట జూనియర్ ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో 20 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండే అవకాశముంది. ఒక్క విద్యార్థి ఎక్కువ ఉన్నా రెండో పోస్టు కేటాయించనున్నారు. లేకుంటే ఒక్కరితోనే సరిపెట్టనున్నారు. ఉన్నత పాఠశాలల్లో 96 మంది కన్నా విద్యార్థులు తక్కువగా ఉంటే హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడి పోస్టులు తొలగిస్తారు. 138 మంది మించి ఉంటే సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున కేటాయిస్తారు. 50 ఏళ్ల కన్నా తక్కువ వయస్సు కలిగిన పురుష ఉపాధ్యాయులు బాలికల ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తుంటే వారిని తప్పనిసరిగా బదిలీ చేయను న్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భౌతికంగా ఉపాధ్యా యులు లేని ఖాళీలను 64 మండలాలకు నిష్పత్తి ప్రకారం కేటాయించి వాటిని బ్లాక్ చేస్తారు. అక్టోబరులో 505 మంది ఉద్యోగోన్నతులు పొందారు. వారు పాత స్థానాల్లోనే కొనసాగు తున్నారు. వారు కూడా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సీనియారిటీని పరిగణలోకి తీసుకుని పోస్టులు కేటాయించనున్నారు.

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



ఆక్వా రైతుల సదస్సులో మాట్లాడుతున్న రఘురాం

రాష్ట్రవ్యాప్తంగా ఆక్వా రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకువెళి క్రాప్ హాలిడే ప్రకటించకుండా వారి సమస్యను పరిష్కరించేందుకు కషి చేస్తానని ఏపీఎస్ఏడిప రాష్ట్ర వైస్ చైర్మన్ వడ్డీ రఘురాం అన్నారు. కాకినాడలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ఆక్వా రైతుల అవగాహన సదస్సును ఆక్వా రైతు సంఘ ప్రతినిధి సిహెచ్‌వి సూర్యారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆక్వా రైతుల పడుతున్న ఇబ్బందులు రాష్ట్ర వైస్ చైర్మన్ రఘురాం దృష్టికి తీసుకువచ్చారు. ఆక్వా రైతులకు పాదయాత్రలో ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలని రూ.45-50 ఫీడ్ వస్తేనే ఆక్వాను ముందుకు తీసుకు వెళ్లగలమని, ఆక్వా రైతుల కోసం ఇప్పటికే నాలుగు సమావేశాలు నిర్వహించి, సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని, కరోనా ముందు ఎటువంటి ధరలు నిర్ణయించారో వాటినే మరలా పునరుద్ధరించాలని, రూ.1.5 కే ఆక్వారంగానికి కరెంటు అందించాలని రైతులు కోరారు. అనంతరం వైస్ చైర్మన్ రఘురాం మాట్లాడుతూ రైతుల సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. అవసరమైతే పోరాటానికి సిద్ధమని, రైతుల క్రాప్ హాలిడే ప్రకటించకుండా వారి సమస్యలు పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి ఆక్వా రైతులు పాల్గొన్నారు.

పిఎంఎంఎస్‌వై యూనిట్లు త్వరగా ప్రారంభించాలి

-మత్స్యశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం విజయవంతానికి ప్రణాళికాయుత చర్యలు తీసుకోవాలని, మంజూరు చేసిన యూనిట్లు వీలైనంత త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కోర్టుహాల్‌లో సోమవారం కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ జరిగింది. పథకం వివరాలను జిల్లా మత్స్య అధికారి పీవీ సత్యనారాయణ వివరించారు. పథకం ద్వారా యూనిట్ వ్యయంపై జనరల్ కేటగిరీలో 40 శాతం, మహిళల, ఎస్‌సి, ఎస్‌టి కేట గిరీలో 60 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేసి, దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ చేపల ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడం, మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు పోషణ భద్రత కల్పించే లక్ష్యంతో పీఎంఎంఎస్‌వై అమలవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా ఉత్పత్తులకు స్థానికంగా మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు హబ్ అండ్ స్పోక్స్ నమూనాను రూపొందిం చిందన్నారు. పీఎంఎంఎస్‌వై కింద జిల్లాలో దాదాపు రూ.1.94 కోట్లతో 127 యూనిట్ల ఏర్పాటుకు తాజా సమావేశం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఐస్ బాక్సుతో కూడి మోటార్ సైకిళ్లు, ఈ-రిక్షాలు, ఇన్సులేటెడ్ వాహనాలు తదితరాలతో పాటు ఫిష్ కియోస్కు, ఫిష్ కియోస్కు, లైవ్ ఫిష్ వెండింగ్ యూనిట్లు, విలువ జోడింపు ఉత్పత్తుల యూనిట్లు కూడా ఏర్పాటు కానున్నాయని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఆమోదం పొందిన యూనిట్లు త్వరగా ప్రారంభమయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశం చారు. సమావేశంలో జడ్‌పి సిఇఒ ఎన్‌వీవీ సత్యనారాయణ, జిల్లా మత్స్య అధికారి పీవీ సత్యనారాయణ హాజరయ్యారు.

మొదటి విడతగా 180 ట్యాబ్‌లు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండల పరిధిలో ప్రస్తుత ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొదటి విడతగా 180 ట్యాబ్‌లు వచ్చినట్టు ఎంఇఒ వై శివరామకష్ణయ్య సోమవారం విలేకరులకు తెలిపారు. మండల పరిధిలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు బాలురు 646, బాలికలు 570 వెరసి 1,216 మంది ఉన్నట్టు చెప్పారు. విద్యార్థుల చదువులు ప్రోత్సహిస్తూ ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ రూ. 14,500 విలువచేసే ట్యాబ్‌లను ఉచితంగా అందిస్తు న్నట్లు చెప్పారు. దానిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన పథకంలో మొదటి విడతగా 180 ట్యాబ్ లు మండలానికి అందినట్టు తెలిపారు. మిగిలిన 1,036 ట్యాబ్‌లు త్వరలోనే రానున్నట్టు చెప్పారు. ఈ ట్యాబ్ లలో బైజ్యూస్ స్టడీ సంస్థకు చెందిన యాప్‌ను అందుబాటులో వచ్చినందున విద్యార్థులు మెరుగైన విద్యను పొందే అవకాశం కల్పించారన్నారు. కార్యాలయానికి చేరిన ట్యాబ్ ల పనితీరును ఎంఇఒ సిబ్బంది పరిశీలించారు.

సేవల నమోదుపై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మాతా శిశు సంరక్షణ సేవలు నూరుశాతం అంతర్జాలంలో నమోదు చేయడంపై పిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం అంగన్వాడీ సిబ్బందికి, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు, శిశువులకు చేసే పరీక్షలు, ఇచ్చే సేవలను అంగన్‌వాడీ టీచర్, ఎఎన్‌ఎంలు సమన్వయం చేసుకుంటూ, ఎప్పటికప్పుడు అన్నింటినీ అంతర్జాలంలో నమోదు చేయాలన్నారు. సిపిడిఒ శ్రీలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సరోజిని, సిహెచ్ఒ సుబ్రహ్మణ్యం, పిహెచ్‌ఎన్ కుమారిచ సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, సుభాషిణి, నాగమణి పాల్గొన్నారు.

ఎస్‌కెఆర్‌లో పూర్వ విద్యార్థినుల సమావేశం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం పూర్వ విద్యార్థినుల కలయిక నిర్వహించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి మాట్లాడుతూ ప్రస్తుత సేవలకు తోడు అదనపు కార్యక్రమాలు చేపట్టాలని కొన్ని ప్రతిపాదనలు చేశారు. ఆలూమ్ని పూర్వ అధ్యక్షురాలు డాక్టర్ డి.పద్మావతి, సభ్యులందరూ చర్చించుకుని తెలియజేస్తామని చెప్పారు. టిజె.రాధాదేవి, డాక్టర్ డి.పద్మావతి, శ్యామలాంబ, లీగల్ అడ్వైజర్ వి.కష్ణకుమారి తదితరుల పర్యవేక్షణలో అలూమ్ని కార్యక్రమాలు బహుముఖ ప్రయోజనకరంగా ఉన్నాయని చెప్పారు. డిఎల్ చిరంజీవి, జక్కంపూడి లత, టి.తులసీకుమారిని ఘనంగా సత్కరించారు. వి.ఉమాజ్యోతి, పి.రంజిని, జి.లలిత, డాక్టర్ మేజర్ కళ్యాణి, టి.మంగాయమ్మ పాల్గొన్నారు.

14, 15న ప్రణాళికాభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి-పెరవలి

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 14, 15వ తేదీల్లో ప్రణాకాభివృద్ధి, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల కోసం 2023- 2024 సంవత్సరానికి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన సూచించారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-గోపాలపురం, నల్లజర్ల

విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుని నూతన ఆవిష్కరణలు చేయాలని అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కర్ రావు, ఎంపిఇ ఉండవల్లి సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ఎంఇఒ జి.శ్రీనివాసరావు, హెచ్‌ఎం సోమశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.లలిత, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, వింత ప్రసాద్ రెడ్డి, గుంజే రమణ పాల్గొన్నారు. నల్లజర్ల మండలంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎగ్జిబిషన్ సోమవారం ప్రారంభమయ్యింది. వివిధ పాఠశాలల నుంచి సైన్స్ ఎగ్జిబిట్ల ప్రదర్శన నల్లజర్లలోని హైస్కూల్లో ప్రదర్శించగా ఎంఇఒ శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోమల చిత్ర, ఎం.రామారావు కె.బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

క్షయ నిర్మూలన జిల్లాగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లాను టిబి రహితంగా తీర్చిదిద్దాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో ని క్షయ్ మిత్ర పథకంలో నలుగురిని దత్తత తీసుకున్నారు. రూ.16800ను జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్‌జిటి.సత్య గోవింద్ ఆన్‌లైన్‌లో ని క్షయ్ మిత్ర బ్యాంకు ఖాతాకు జమ చేశారు. జిల్లాలో క్షయవ్యాధిని సమూలంగా నిర్మూలన చేసే దిశలో వ్యాధిగ్రస్తులకు పోషక విలువలతో కూడి మంచి పౌష్టకాహారం అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని డిఆర్ఓ నరసింహులు అన్నారు. జిల్లాలో సుమారు 1400 మంది క్షయ బాధితులు ఉన్నారని వారిలో ఇప్పటి వరకు 378 మందిని 64 మంది నిక్షయ మిత్రులు పేర్లు నమోదు చేసుకుని దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్‌జిటి.సత్య గోవింద్, డాక్టర్ ఎన్.వసుంధర పాల్గొన్నారు.

శరవేగంగా రాజమహేంద్రవరం అభివృద్ధి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో రాజమహేంద్రవరం నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. సోమవారం నగరంలోని 31వ వార్డులో రూ.కోటి వ్యయంతో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులకు ఎంపీ భరత్ శ్రీకారం చుట్టారు. తొలుత ఈ వార్డులలో చేపట్టే పనుల వివరాలతో కూడిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం అజాద్ చౌక్ వద్ద శంకుస్థాపన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ భరత్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి సిఎం జగన్ రూ.125 కోట్లు మంజూరు చేశారని, అది కాకుండా ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేశారన్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయా వార్డులలో అభివద్ధి పనుల నిమిత్తం ప్రతి వార్డుకూ రూ.కోటి మంజూరు అయ్యాయన్నారు. టిడిపి హయాంలో ఎప్పుడూ ఇన్ని కోట్లు నగరానికి మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. సభలో కమిషనర్ కె.దినేష్ కుమార్, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, అరీఫ్, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, పిల్లి నిర్మల, ఆదినారాయణ, ఎన్వీ శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు.

రోగులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-బిక్కవోలు

బిక్కవోలు పిహెచ్‌సిలో జిల్లా అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసుంధర గ్రాసిమ్ ఇండస్ట్రీ ప్రతినిధుల ఆధ్వర్యంలో 23 మంది టిబి రోగులకు సోమవారం పౌష్టికాహార కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వసుంధర మాట్లాడుతూ టిబిని త్వరగా గుర్తించి చికిత్స చెయ్యడం ద్వారా అరికట్టవచ్చని , తద్వారా ఇతరులకు ఈ వ్యాధి సోకకుండా రక్షించవచ్చని చెప్పారు. గ్రాసిమ్ ఇండస్ట్రీ 23 మంది టిబి రోగులు ను దత్తత తీసుకుని ఒక్కరికీ రూ.713 విలువైన కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రాసిమ్ ప్రతినిధులు క్రాంతికుమార్, ముని భాస్కర్ రెడ్డి, డాక్టర్ రాజీవ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-గండేపల్లి



మొక్కలు నాటుతున్న దృశ్యం

ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు బాధ్యత తీసుకోవాలని పలువురు పిలుపు ఇచ్చారు. సూరంపాలెం ఆదిత్య విద్యా సంస్థల కన్స్ట్రక్షన్ విభాగం డైరెక్టర్, జిల్లా బ్యాడ్మింటిన్ సంఘం మాజీ కార్యదర్శి మేడపాటి భాస్కర చంద్రారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. భాస్కర చంద్రారెడ్డికి ఆదిత్య అధినేత డాక్టర్ శేషారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినేషన్స్ విభాగం డీన్ జొన్నలగడ్డ పవన్, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్, ఆదిత్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

ప్రజాశక్తి- నల్లజర్ల, సీతానగరం

నల్లజర్ల మండలం ఆవపాడులో అయినపర్తి సీతయ్య (38) సోమవారం విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక రైతు చేలో పామాయిల్ గెలలు కోసేందుకు కూలి పనికి వెళ్లాడు. పామాయిల్ గెలలు కోస్తూ ఉండగా అనుకోకుండా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు చేతిలో ఉన్న ఇనుప కత్తి తగలడంతో సీతయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సీతయ్యకు భార్య దుర్గ కుమార్తె, పోసమ్మ ఉన్నారు. కూలి నాలి చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే సీతయ్య మతితో ఆ కుటుంబం రోడ్డున పడింది.

విద్యుత్ తీగలు తగిలి లారీ డ్రైవర్ మృతి

సీతానగరం మండలం రఘుదేవపురంలో రహదారిలో విద్యుత్ తీగలు తగిలి లారీ డ్రైవర్ మృతి చెందాడు. ధాన్యాన్ని మార్కెట్‌కు లారీపై తరలిస్తుండగా లారీ డ్రైవర్ సమర్తగుర్తి వాడపల్లి (32) లారీ పైకి ఎక్కాడు. పమాదవశాత్తు చెయ్యి లారీ పైన ఉన్న సర్వీసు వైర్లకు తగిలి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శుభ శేఖర్ తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఆదిరెడ్డి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ సోమవారం ట్రోఫీలను అందచేశారు. విన్నర్స్, రన్నర్స్ కు ట్రోఫీలను అందజేశారు. అనంతరం ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకున్న వారెందరో ఉన్నారని, వారిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.రమణ, డి.గంగాధర్, చాపల చిన్ని రాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



గాయపడిన బాధితులు

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట-కాకినాడ కెనాల్ రోడ్డులో వెంకటకృష్ణారాయపురం-మాధవ పట్నం గ్రామాల మధ్యలో సోమవారం ఆటో ప్రమాద వశాత్తు రోడ్డు పక్కన గల పంట కాలువలోకి దూసుకువెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. కాకినాడ కు చెందిన వారు సోమవారం పెద్దాపురంలో తమ బంధువుల ఇంట జరిగిన శుభ కార్యానికి హాజరై, తిరుగు ప్రయాణంలో మాధవపట్నం సమీపించేసరికి ముందుగా వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తున్న సమయంలో ఆటో అదుపు తప్పి కాలువలోకి బోల్తా పడింది. గాయ పడిన వారిని స్థానికుల సహాయంతో కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.